క్లుప్తంగా

కోర్టు భవన కార్మికులకు వస్త్రాలు



కార్మికులకు వస్త్రాలు, భోజనాలు అందచేస్తున్న జిల్లా జడ్జి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నూతనంగా నిర్మించి, ఇటీవల ప్రారంభించిన జిల్లా న్యాయస్థానాల సముదాయం (కోర్టు కాంప్లెక్సు) కోసం పనిచేసిన భవన కార్మికులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమ్‌రావు నూతన వస్త్రాలు అందజేశారు. కోర్టు కాంప్లెక్సు వద్ద దాదాపు 80 మంది కార్మికులకు గురువారం నూతన వస్త్రాలతో పాటు భోజనాలు అందించారు. కోర్టు భవనాల నిర్మాణంలో కార్మికుల కష్టం మరువలేనిదని జిల్లా జడ్జి అన్నారు. జిల్లా జడ్జితో పాటు న్యాయశాఖ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు గోపినాథ్‌రెడ్డి, లక్ష్మీపతి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాలవైద్యాధికారి రష్మిత అన్నారు. వసంతాపురంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ పేషెంట్లకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 65 మంది రోగులు పాల్గొన్నారు. మంచాన పడిన రోగులకు ఇంటివద్దే వెళ్లి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జబసెల్వి, ఉమామహేశ్వరి, సుజిమ, చంద్ర పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో 'ఎంప్లాయిమెంట్' సేవలు

చిత్తూరు కలెక్టరేట్: ఎంప్లాయిమెంట్ సేవలను ఆన్‌లైన్‌లో పొందే అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా ఉపాధికల్పనా శాఖాధికారి పద్మజ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులు ఇకపై ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్ కోసం ఉపాధి కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదన్నారు. www.Employment.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకు ఈ-మెయిల్ ఐడీతో లాగిన్ కావాల్సి ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ నంబర్ ఎస్ఎంఎస్ లో పొందవచ్చని చెప్పారు.ఎంప్లాయిమెంట్ కార్డును కూడా లాగిన్ లోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

తవణంపల్లె ఎంపీపీ ఉదారత



వాటర్ బాటిళ్లు అందజేస్తున్న ఎంపీపీ

తవణంపల్లె: గాజులపల్లె ఎస్‌జీబీ బ్యాంకు వద్ద ఎండల్లో పింఛన్ డబ్బులు కోసం నిరీక్షిస్తున్న వృద్ధులను చూసి చలించి వారి దాహం తీర్చడానికి అందరికి వాటర్ బాటిళ్లను తీసుకొచ్చి అందజేసి తమ ఉదారత చాటుకొన్నారు. నేతలు రవిరెడ్డి, శివాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టోత్తర శత శంఖాభిషేకం



గురుదక్షిణామూర్తికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తగా అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహించారు. నవగ్రహాల్లో ఐదో గ్రహమైన బృహస్పతి మేషరాశి నుంచి వృషభ రాశిలోకి సంక్రమణ చెందిన సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్, ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో వేదపండితులు గురుదక్షిణామూర్తి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చారు. అనంతరం కలశపూజలు, హోమపూజలు నిర్వహించారు. అనంతరం 108 శంఖాలతో అభిషేకాలు జరిపారు. ఆ తరువాత గురుదక్షిణామూర్తిని విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్వాకం.. అవ్వాతాతలకు శాపం

జిల్లాలోని గుడిపాల మండలంలోని చాలా గ్రామాల నుంచి వృద్ధులు పింఛన్‌ల కోసం మండల కేంద్రానికి గురువారం ఉదయాన్నే వచ్చేశారు. రాకపోకలకు సమస్యలున్నా అద్దె ఆటోలు పెట్టుకుని మరీ కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకులకు వచ్చారు. అక్కడికొచ్చాక వందల సంఖ్యలో పింఛన్‌దారులు ఉండడంతో గంటల కొద్ది క్యూలోనే నిలబడ్డారు. క్యూలో నిలబడలేక, కింద కూర్చోలేక వృద్ధులు పింఛన్‌ల కోసం అవస్థలు పడ్డారు.

- బ్యాంకుల వద్ద వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు
- కిలోమీటర్ల దూరం నుంచి వ్యయప్రయాసలతో రాక
- సర్వర్ సమస్యలతో పింఛన్‌లు పొందలేక ఇబ్బందులు

చిత్తూరు కలెక్టరేట్: ఐదేళ్లుగా ఇంటి వద్దనే ఒకటో తేదీన సంతోషంగా పింఛను తీసుకున్న అవ్వాతాతలు ఇప్పుడు నానాఅగచాట్లు పడుతున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ పింఛనుదారులను ముప్పుతిప్పలు పెట్టిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకుని వలంటీర్ల సేవలను అడ్డుకున్నారు. దీంతో మళ్లీ వృద్ధులకు, దివ్యాంగులకు కష్టాలు మొదలయ్యాయి. టీడీపీ హయాంలో ఎంపీడీఓ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కుట్ర రాజకీయాలకు పాల్పడిన టీడీపీ ఇంటివద్దకు పింఛన్‌ల పంపిణీ చేయకుండా వలంటీర్లను అడ్డుకుంది. దీంతో ప్రభుత్వం ఈ నెల పింఛను మొత్తాన్ని బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ పొందేందుకు బ్యాంకుల వద్దకెళ్లి అగచాట్లు పడుతున్నారు. బ్యాంకుల్లో సర్వర్ సమస్య, బ్యాంక్‌ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాకపోవడం, కొన్ని ఖాతాలను లబ్ధిదారుల వినియోగించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాత బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ అవ్వడంతో ఖాతా వినియోగంలో లేనందువల్ల రూ.400 బ్యాంకు చార్జీల కింద కట్ చేశారు. వృద్ధులపై కక్ష సాధించిన టీడీపీపై వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు.



చిత్తూరు: పింఛన్ కోసం బ్యాంకులో వేచి చూస్తున్న వృద్ధులు

మండుటెండలో వచ్చాను



పింఛన్ కోసం మండుటెండలో నడవలేక అవస్థలు పడుతూ బ్యాంకు వద్దకు వచ్చాను. ఐదేళ్లుగా వలంటీర్లు ఒకటో తేదీన కరెక్టుగా మా ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చేవారు. నాకు ఆరోగ్య సమస్యలున్నాయి. పింఛన్ డబ్బు వస్తే ఒకటో తేదీన మందులను కొనుక్కునే వాడిని. ఈ నెల, పోయిన నెల నా అవస్థలు ఎవరికి చెప్పుకోవాలి. గత నెల ఏమో సచివాలయం వద్ద, ఈ నెల ఏమో బ్యాంకుల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదంతా చంద్రబాబునాయుడు చేసిన కుట్ర వల్లేనని అందరికీ తెలుసు. ప్రజలు సంతోషంగా ఉంటే చంద్రబాబు చూడలేడు.

–కణ్ణయ్య, ఓటిచెరువు, చిత్తూరు నగరం

పుల్లపెట్టడాలు ఎందుకయ్యా చంద్రబాబు



న్యాయంగా, ధర్మంగా ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి కానీ ఇలా పుల్ల పెడితే చంద్రబాబు గెలవలేడు. కుట్రలు చేయడం వల్లే కదా ఇంటి వద్దకు వచ్చి ఇచ్చే పింఛన్‌లను అడ్డుకున్నారు. గతంలో కూడా ఇలాగే చేశాడు. ఊర్లో పింఛను తీసుకువాళ్లు ఎవరైనా చనిపోతేనే కొత్త పింఛను ఇచ్చేవాడు. ఇప్పుడు మళ్లీ ఈ చంద్రబాబు నిర్వాకంతో మేము బ్యాంకుల కెళ్లి క్యూలో గంటల తరబడి నిలబడ్డాము. ఇప్పుడు బాబుకు సంతోషంగా ఉంటుంది. ప్రజలకు జగన్ మంచి చేస్తే చూసి ఓర్వలేకపోతున్నాడు. ఈ మోసగాడు మాకు రూ.4 వేలు పింఛన్ ఇస్తాడట.

–వసంత, దుర్గానగర్‌కాలనీ, చిత్తూరు నగరం

మా ఉసురు ఊరికేపోదు



ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లారకే ముందే పింఛన్ ఇచ్చే వలంటీర్లను ఎన్నికల కమిషన్ ద్వారా అడ్డుకుని టీడీపీ కుట్ర చేసింది. చంద్రబాబు మోసగాడు, దుర్మార్గుడని అందరికీ తెలుసు. పింఛన్లు ఇలా ఎవరు ఇస్తారో, ఎక్కడ ఇస్తారో తెలియక ఉదయం నుంచి తిరుగుతున్నాం. కొంత మంది బ్యాంకు ఖాతాకు వేస్తామంటున్నారు. కొంత మందేమో తెలియదంటున్నారు. నన్ను ఇలాంటి వయసులో వేదనకు గురిచేసిన వారికి మా ఉసురు ఊరికేపోదు. చంద్రబాబు గతంలో ఇట్లానే చేశాడు. మళ్లీ ఇలా చేస్తున్నాడు. మాయలపకీరుని తరిమికొట్టాలి.

–మునిలక్ష్మీ, బీఎస్‌ఆర్‌పేట, చిత్తూరు మండలం

గత పరిస్థితులే మళ్లీ వచ్చాయి



టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం ఎంపీడీఓ కార్యాలయాల వద్దకు వెళ్లి సాయంత్రం వరకు పడిగాపులు కాసేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా కష్టాలు తొలిగాయి. మేము ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా మా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చే విధానం తీసుకొచ్చారు. ఇపుడు మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేక కుట్రలు చేశాడు. నేను చాలా సంవత్సరాల నుంచి చూస్తున్న చంద్రబాబునాయుడు కుట్రలు ఇలానే ఉంటాయి. రోజంతా బ్యాంకు వద్దే నాతో పాటు చాలా మంది ఉన్నారు. ఈ పాపం తప్పకుండా చంద్రబాబుకు తగులుతుంది.

–నీలా, ఇరువారం, చిత్తూరు నగరం.

ఇంటికి వస్తున్న పింఛన్ ఆపేశాడు



ప్రతినెలా ఇంటికి వస్తున్న పింఛన్‌ను ఇవ్వకుండా చంద్రబాబు ఆపేశాడన్న విషయం మాకు తెలుసు. బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం అని చెబుతున్నారు. ముసలోళ్లు అయిన తాము బ్యాంకులకు ఎట్లా వెళ్లాలి. బ్యాంకు ఖాతా వాడక చాలా సంవత్సరాలు అయ్యింది. ఖాతా ఉందో లేదో కూడా తెలియడం లేదు. చంద్రబాబునాయుడు మొదటి నుంచి ఇంతే. మాలాంటి ముసలోళ్లతో రాజకీయం చేస్తాడు దుర్మార్గుడు. బ్యాంకుకు వెళ్లాలంటే ఏడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంది. ఈ ఐదేళ్లలో ఇలాంటి అగచాట్లు మేము ఎప్పుడూ అనుభవించలేదు.

–రమీల, వృద్ధురాలు, గుడిపాల

ఈ పాపం బాబుదే !



నెలనెలా ఇంటి వద్దే పింఛన్ తీసుకుంటున్నాం. ఇప్పుడు చంద్రబాబు వారి బినామీల ద్వారా ఫిర్యాదు చేశాడు. వలంటీర్ల సేవలను అడ్డుకున్నాడు. మాలోంటోళ్లకు నరకం చూపిస్తున్నారు. వృద్ధుల ఉసురు తగలక తప్పదు. పింఛన్ ఖాతాలో వేసినా బ్యాంకుకు వెళ్లి తెచ్చుకోవడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోంది. ఎప్పుడు పింఛన్ చేతికి వస్తుందో తెలియడం లేదు. ఐదేళ్లు వలంటీర్ల ద్వారా ఇబ్బంది లేకుండా ఇంటికాడే పింఛన్లు తీసుకున్నాం. చంద్రబాబు కళ్లు పడి జగన్ ప్రభుత్వానికి దిష్టి తగిలింది. మాలాంటి వాళ్లతో రాజకీయాలు చేస్తున్నాడు.

–రాధా, బీఎస్‌ఆర్‌పేట, చిత్తూరు మండలం

నిప్పుల కొలిమి

చిత్తూరు రూరల్(కాణిపాకం): భానుడి ప్రతాపంతో జిల్లా భగ్గుమంటోంది. అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. చిత్తూరులో గురువారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరికొన్ని ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో 44 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. జిల్లా అంతటా 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఎండలు మండుతున్నాయి. రెండు రోజులుగా ఎండల ప్రభావం మరింత పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, వడగాలులతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ సూర్యుడు మండిపోతుండడంతో రోజువారీ కూలీలు, నిత్యం పనుల నిమిత్తం బయటకు వచ్చే వారు తట్టుకోలేక పోతున్నారు. అయితే మధ్యాహ్నం తరువాత జిల్లాలో పలు చోట్ల వర్షం కురిసి వాతావరణం కాస్త చల్లబడింది.

రథం పేరుతో ఆలయ ప్రతిష్టకు భంగం



రథాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): రథం పేరుతో ఆలయ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ, శ్రీకోదండరామస్వామి ఆలయ ఈఓ సుబ్రమణ్యం నాయుడు అన్నారు. చిత్తూరు నగరం చర్చివీధిలో రథాన్ని ఉంచారు. ఈ రథం ట్రాఫిక్ అంతరాయంగా ఉండడంతో కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఈవిషయం కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే రోడ్డులోని రథాన్ని గురువారం రాత్రి పరిశీలించారు. ఆ రథాన్ని భద్రపరిచేందుకు స్థల సేకరణ చేశామన్నారు. రెండు రోజుల్లో భద్రత పనులు పూర్తవుతాయని చెప్పారు. దీనిపై అసత్య ప్రచారాలు వద్దని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాల్, పర్యవేక్షకులు సుమనప్రియ తదితరులు ఉన్నారు.

జిల్లాలో గాలివాన బీభత్సం



వీస్తున్న గాలులు



రాచరంగయ్యపల్లె వాలిపోయిన వరి పంట



మృతి చెందిన పాడి ఆవు



పలమనేరులో కురుస్తున్న వర్షం

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని రామకృష్ణాపురం, చింతపెంట, ఉగ్రాణంపల్లె, చిప్పార పల్లె, కామచిన్నయ్య ప్రాంతాల్లో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. మామిడితోటల్లో కాయలు 4 టన్నుల వరకు రాలిపోయాయి. రాచరంగయ్యపల్లె, రామకృష్ణాపురం, బండకిందపల్లె, తిరివిరెడ్డిపల్లె ప్రాంతాలలో 15 ఎకరాల్లో కోత దశలో ఉన్న వరి పంట చెల్లాచెదురుగా పడిపోయింది. గాంధీపురం, గొబ్బిళ్లమిట్ట, చిప్పార పల్లె, గెంధపాడివారిపల్లెలో బంతిపూల పంటలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడడంతో గురువారం రాత్రి వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పిడుగు పడి ఆవు మృతి

మండలంలోని తాటిమాకులపల్లె పంచాయతీ విడిదిపల్లె ఎన్టీఆర్ కాలనీలో గురువారం సాయంత్రం కురిసిన గాలివానకు పిడుగు పడి ఓ పాడి ఆవు మృతి చెందింది. రైతు బి.ఆదెమ్మ పొలంలో ఉన్న చెట్టుకు పాడి ఆవును కట్టేసింది. ఉన్నట్టుండి గాలీవాన రావడంతో పిడిగు పాటుకు ఆవు మృతి చెందింది. సుమారు రూ.60 వేలు నష్ట పోయినట్లు బాధితురాలు వాపోయింది.

బంగారుపాళెంలో వర్షం

బంగారుపాళెం: మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడిన మండల ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఉన్నఫలంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మబ్బులు ఆవరించాయి. 45 నిమిషాల పాటు జోరు వర్షం కురిసింది. వర్షానికి గాలి తోడైంది. 10 నెలల తరువాత వర్షం కురవడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నేలరాలిన మామిడి

మండలంలో గురువారం సాయంత్రం గాలీవానకు మామిడి తోటల్లో కాయలు నేల రాలినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పాలేరు, శేషాపురం, మొగిలిగ్రామాల్లో పెనుగాలులకు కాయలు రాలిపోయాయన్నారు. పాలేరుకు చెందిన రైతులు సుబ్రమణ్యంరెడ్డి, యుగంధర్ మామిడి తోటలో 200 కిలోలు నేల పాలైయ్యాయని బాధితులు తెలిపారు. ఈ ఏడాది మామిడి తోటల్లో కాపు అంతంత మాత్రంగానే ఉందని రైతులు వాపోయారు. తోటల్లో కాసిన తక్కువ కాయలు అకాల వర్షానికి తోడు గాలులు వీచడంతో మామిడి రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు.

వానొచ్చిందోచ్!

పలమనేరు: కొన్నిరోజులుగా భానుడి భగభగలకు అల్లాడిపోతున్న ప్రజానీకానికి వరుణుడు ఉపశమనం కలిగించాడు. గురువారం మధ్యాహ్నం పలమనేరులో వర్షం కురిసింది. వాతావరణం సైతం చల్లబడింది. వేసవి దుక్కులకు ఈ వర్షం కాస్త అనుకూలంగా మారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ



ఎంసీఎంసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు

చిత్తూరు కలెక్టరేట్: ఎంసీఎంసీ కమిటీ సభ్యులు ఎన్నికల రికార్డులను పక్కాగా నిర్వహించాలని అబ్జర్వర్లు కై లాష్ వాంఖడే, షాదిక్ అలం ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌ని ఎంసీఎంసీ (మీడియాసర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ)ని తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలింగ్ ముగిసే వరకు ఎంసీఎంసీ సభ్యులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. మోడల్ కోడ్ మేరకు వివిధ సామాజిక మాధ్యమాలు, ఛానెల్స్‌లో ప్రసారమయ్యే పెయిడ్ న్యూస్‌లను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ, ఎంసీఎంసీ నోడల్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తలుపు తట్టి సంక్షేమాన్ని అందించాం

- చంద్రబాబు వస్తే జన్మభూమి కమిటీలదే పెత్తనం
- పాలనలో తేడాను గమనించండి
- ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



గుడిపాల: 189కొత్తపల్లెలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిత్తూరు: వృద్ధురాలిని ఓటడుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. నగరంలోని అన్నపల్లె, ప్రశాంత్‌నగర్‌కాలనీలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న ప్రభుత్వంలో పథకాలు నేరుగా ఇంటికే వస్తాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పథకాలు కాదు కదా కనీసం సర్టిఫికెట్ కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. పాలనలో గత ప్రభుత్వాలకు, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు గమనించి ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకుందామన్నారు. కరోనా సమయంలో ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలు పేద ప్రజలకు భరోసా ఇచ్చాయన్నారు. వలంటీర్లు గ్రామంలో ఉన్న వారు ఏపార్టీకి చెందిన వారో తెలిసినా పక్షపాతం చూపకుండా పథకాలు అందించారని గుర్తుచేశారు. కరోనా సమయంలో కుటుంబాలను పక్కన పెట్టి, వారి ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారన్నారు. అటువంటి వలంటీర్లను టీడీపీ నాయకులు గజదొంగలతో పోల్చారని చెప్పారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లు అమ్మాయిలను కిడ్నాప్ చేస్తున్నారంటూ దిగజారుడు విమర్శలు చేసిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. వాడుకొని వదిలేయడం చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు. టీడీపీకి ఓటేస్తే జన్మభూమి కమిటీలదే పెత్తనం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. కనీసం ఇన్‌కమ్ సర్టిఫికెట్ కావాలన్నా వారి చుట్టూ తిరిగే పరిస్థితి మళ్లీ వస్తుందని చెప్పారు. టీడీపీ ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకొని వచ్చినా వచ్చే ఎన్నికలలో విజయం సాధించేది వైఎస్సార్సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, కార్పొరేటర్ శోభ, నాయకులు శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే బీసీల అభ్యున్నతి

బీసీల అభ్యున్నతి జగన్‌తోనే సాధ్యమని వన్నెకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాశీనాథన్, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు రావూరి ఈశ్వర్‌రావు లిపారు. స్థానిక డీఐ రోడ్డు పరిసర ప్రాంతాల్లో గురువారం వారు ఫ్యాను గుర్తుకు ఓటేయండని ప్రచారం చేశారు. చంద్రబాబు వన్నెకులస్తులను వాడుకొని వదిలేయడం తప్ప వారి కోసం చేసేందేమీ లేదన్నారు. చిత్తూరులో వన్నెకుల కమ్యూనిటీ భవన్ కట్టించాలని పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదని గుర్తుచేశారు. అదే చిత్తూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి విషయం చెప్పగానే మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున రెండు ఎకరాల స్థలం ఇచ్చారన్నారు. భవన నిర్మాణం కోసం విజయానందరెడ్డి రూ.20 లక్షలు సాయం చేశారని గుర్తు చేశారు. పదవులు, పనుల్లో బీసీలకు ప్రాధాన్యతనిస్తున్నారని కొనియాడారు. గతంలో ఎవరి హయాంలో చూడని అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకత తాము ఇప్పుడు చూస్తున్నామన్నారు. అదీ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కన్నన్, దీపక్, కుమార్, శేఖర్, వికాస్ తదితరులు పాల్గొన్నారు. ఎల్‌బీపురం డివిజన్‌లో అంజలిరెడ్డి, జెండామనువీధిలో నాయకులు కెప్టెన్‌శివ, సంతపేటలో నారాయణ, ఇరువారంలో డేవిడ్ ప్రచారం చేశారు.







ఇరువారంలో డేవిడ్ ప్రచారం, డీఐరోడ్డులో కాశీనాయకర్, రావూరి ఈశ్వర్‌రావు ప్రచారం, **గుడిపాల:** ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, చెరువుముందరవూరులో ఓటడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, చిత్తపారలో నాయకుల ఎన్నికల ప్రచారం